# ఆలోచించి ఓటు వేయాలి

- మైనార్టీలకు అండగా తెలంగాణ ప్రభుత్వం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్నీ బంద్
- రైతుబంధును ఆపింది, అన్నదాతను ఇబ్బంది పెట్టేదెవరు?
- అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదన్నట్లుంది వాళ్ల వ్యవహారం
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, నవంబర్ 27 : మైనార్టీలకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందని, పేదింటి మైనార్టీ అమ్మాయిల పెండ్లికి కానుకగా సర్కారు షాదీ ముబారక్ రూపంలో లక్షా నూటాకు డూర్లు అందిస్తున్నదని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 10, 11 వార్డుల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వాలు మైనార్టీ నాయకులను ఇబ్బందులకు గురి చేశాయని గుర్తు చేశారు. మైనార్టీలకు గుణాత్మక విద్యను అందించాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకులాలు ఏర్పాటు చేశారని వివరించారు. మైనార్టీల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మైనార్టీ బంధుతో ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓటేస్తే ప్రస్తుతం అమలవుతున్న పథకాలన్నీ బంద్ అవతాయని, అందుకే ప్రజలు ఆలోచించి ఓటేయాలని సూచించారు. గద్వాల నియోజకవర్గంలో మైనార్టీలు ఉన్న ప్రతి చోట ఉర్దూ ఘర్, షాదీఖానాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ మైనార్టీ నాయకులు షుకూర్, హేస్మాబేగం, రిజ్వాన్, మోసిన్, ఫయాజ్, నాయకులు వేణుగోపాల్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**కులవృత్తులకు చేయూత**

కులవృత్తులకు ప్రభుత్వం చేయూతనిచ్చి వారు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు తోడ్పాటు అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాయీబ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడు భగీరథ వంశీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెలూన్ షాప్‌లకు 250యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందజేస్తుందన్నారు. వారికి బీసీబంధులో అవకాశం కల్పించి చేయూతనిచ్చారని గుర్తు చేశారు. నాయిబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, వారికి విద్య, వైద్య, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. సమావేశంలో నాయకులు హనుమంతు, సవారన్న, శ్రీను, జానకిరాములు, బలరాం, ప్రతాప్, గోవర్ధన్, విక్రమసింహారెడ్డి, దేవేందర్, శివ, గోపి, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలే..**

గద్వాల అర్బన్, నవంబర్ 27 : కాంగ్రెస్ పార్టీని నమ్మితే కష్టాలే తప్పా సంతోషాలు ఉండవని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్, బీజేపీ, విద్యార్థి సంఘం నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రంలో మార్పు వచ్చిందని, ఏండ్ల తరబడి పాలించిన పార్టీలను నేడు ప్రజలు ఆదరించే పరిస్థితి లేదన్నారు. అసత్య ప్రచారాలను తిప్పికొట్టడానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో పెద్ద మొత్తంలో అభివృద్ధి జరిగిందని వివరించారు. రైతులకు ఆపద్బాంధవుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచారని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుంటే పానకంలో పుడక లాగా కాంగ్రెసోళ్లు అడుగడుగునా అడ్డం పడుతున్నారని విమర్శించారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తెలంగాణప్రభుత్వం రైతుల కోసం రైతుబంధు ఇస్తుంటే డబ్బులు వారి ఖాతాలో జమ చేయకుండా హస్తం పార్టీ నాయకులు అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధును ఆపింది వాళ్లే.. అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు.. అన్నట్లు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమం చేయదు, చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని చేయనివ్వకుండా అడ్డుతగులుతున్నదని ఘాటుగా విమర్శించారు. రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే రైతుబంధు ఆపరని, రాజకీయం కేవలం వారి స్వార్థం కోసం చేస్తున్నారు తప్పా ప్రజా క్షేమం కోసం కాదని ఎద్దేవా చేశారు. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. అందుకోసమే కుల, మతాలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తూ పచ్చని పల్లెల్లో కుల చిచ్చు పెడుతున్నారన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రజలు గమనించి మరో సారిఆలోచించి ప్రతిపక్షాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం చైర్మన్ తిమ్మప్ప, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సవారన్న, అహ్మద్, గుండన్న, లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్యాం, కేశవ్‌రెడ్డి తదితరులున్నారు.

**మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం**

మల్దకల్, నవంబర్ 27 : రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, మళ్లీ కేసీఆరే సీఎంగా ఉంటారని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. సోమవారం రాత్రి మండలంలోని ఎల్కూర్, ఎద్దుగూడెం, మల్దకల్ గ్రామాల్లో ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కర్ణాటకలో రైతులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయన్నారు. సీఎం కేసీఆర్ రైతులతోపాటు అన్ని వర్గాలకు న్యాయం చేశారన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునిగినట్లేనన్నారు. వలసొచ్చినోళ్లకు ఇక్కడి ప్రజల మనోభీష్టం ఎలా తెలుస్తుందన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేదమ్మున్న నాయకుడు కేసీఆరేనని గట్టు తిమ్మప్ప అన్నారు. రాబోయే ఎన్నికల్లో వాల్మీకులంతా గంప గుత్తగా కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సర్పంచులు యాకోబు, రాధానీలా, ఎంపీటీసీలు లక్ష్మన్న, జయమ్మ, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, నరేందర్, మధు, బాబురావు, పరశురాముడు, తిమ్మరాజు, ప్రభాకర్, నారాయణ, వార్డు సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


మల్దకల్ మండలం ఎల్కూర్‌లో ఎమ్మెల్యే బండ్ల ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న గ్రామస్తులు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాయీబ్రాహ్మణులు


ఎమ్మెల్యే బండ్ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

# పల్లెల ప్రగతి బీఆర్ఎస్‌తోనే..

- ఆదరించండి.. అభివృద్ధి చేస్తా..
- కాంగ్రెసోళ్ల మాయమాటలను ప్రజలు నమ్మొద్దు
- బీఆర్ఎస్ అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు


అమరవాయిలో బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజలు


మానవపాడులో ఓటు అభ్యర్థిస్తున్న విజయుడు

మానవపాడు, నవంబర్ 27 : "కాంగ్రెసోళ్ల మాయమాటలు నమ్మొద్దు. పల్లెలె ప్రగతి సాధించాలంటే కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యం. సంక్షేమ ఫలాలు అందాలంటే కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీ కట్టబెట్టాలి" అని అలంపూర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు కోరారు. సోమవారం మండలంలోని మానవపాడు, చెన్నిపాడు గోకులపాడుగ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుడు గట్టు తిమ్మప్పతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోకులపాడు ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. కాంగ్రెస్ పాలనలో తాగు, సాగునీటికి ఎన్నో కష్టాలు పడ్డామని, తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే సమస్యలు తీరాయన్నారు. గతంలో ఎలాంటి సంక్షేమ పథకాలు లేవని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, దళిత బంధు వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతుబంధు రూ.16వేలకు పెంపు, రేషన్‌కార్డుదారులందరికీ బీమా, అన్నపూర్ణ పథకం కింద సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు అందించనున్నారన్నారు. అలంపూర్ నియోజకవర్గం అంటేనే ముందుగా గుర్తుకొచ్చేది ఆర్డీఎస్ అని.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా సాగునీరు అందిస్తున్నారన్నారు. మల్లమ్మకుంట, జులెకల్, వల్లూరు రిజర్వాయర్లు పూర్తి చేసి సాగునీటిని అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి మరోసారి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. తాను పేదింటి నుంచి వచ్చిన వ్యక్తి అని, పేదల కష్టాలు తెలుసు కాబట్టి వాటిని తీర్చేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

**కేంద్రం మోసం చేస్తోంది: గట్టు తిమ్మప్ప**

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా వారు మోకాలడ్డుతున్నారని కన్జ్యూమర్ ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప విమర్శించారు. రెండుసార్లు తీర్మానం చేసినా బోయల ఓట్లు మొత్తం బీఆర్ఎస్‌కు పడతాయనే భయంతో ఒప్పుకోవటేల్లన్నారు. ఈసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెడితే బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేలా కేసీఆర్ చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సంజీవనాయుడు, నాగశేషన్న, సీతారాంరెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, మురళిరెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులున్నారు.

# ఓటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్నికల రాష్ట్ర ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో అపూర్వ చౌహాన్

గద్వాల, నవంబర్ 27 : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఇతర ముఖ్య అధికారులతో కలిసి సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాగా ఐడీవోసీ కార్యాలయం నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, అపూర్వచౌహాన్ జోగులాంబ గద్వాల జిల్లా తరపున వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి పోలింగ్ నిర్వహణ, ఓటర్ గుర్తింపుకార్డుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎంల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర వాటిపై సమీక్షించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో యవత, మహిళలు, దివ్యాంగులు పోలింగ్‌లో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. అధికారులు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల ప్రచారం నవంబర్ 28 సాయంత్రం 5గంటలకు ముగుస్తుందని, 48గంటల పాటు సైలెన్స్ పీరియడ్ పాటించాల్సి ఉంటుందన్నారు. రిటర్నింగ్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై సమాచారం అందించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపునకు అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు.